క్లుప్తంగా

సురేందర్‌రెడ్డిని కలిసిన మంత్రి తుమ్మల



రామసహాయం సురేందర్‌రెడ్డితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్‌: కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తుమ్మల నాగేశ్వరరావు వెంట ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, సూరజ్‌ శేఖర్‌రెడ్డి, సాధు రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పరామర్శ..

కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు బాబోతు సోమ్లానాయక్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోమ్లా నాయక్‌ను తుమ్మల పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ..



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల గ్రామానికి చెందిన వడ్లకొండ సోమయ్య ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆదివారం బాధితుడిని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ గుజ్జర్లపూడి రాంబాబు, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, నాయకులు ఏపూరి మహేందర్‌కుమార్‌, దమ్మలపాటి సత్యనారాయణ, ఐట్టా శ్రీను, దేవండ్ల రామకృష్ణ, మాలోత్‌ ప్రేమ్‌కుమార్‌, కొనకంటి నాగేశ్వరరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాల్వ పనులు వేగవంతం చేయాలి

కామేపల్లి: సీతారామ ప్రాజెక్టు కాల్వ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని టీడీపీ లీగల్‌ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు కోరారు. ఆదివారం కామేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంతో మండలంలో సాగు, తాగునీటి సరఫరా చేపట్టాల్సిన పనుల పట్ల ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తక్షణమే కాల్వ నిర్మాణ పనులు చేపట్టి మండలంలోని రైతాంగాన్ని ఆదుకోవాలని, లేకుంటే రైతులను కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

సన్నాహక సమావేశానికి హాజరుకావాలి

కామేపల్లి: నేడు ఇల్లెందులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్‌ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం పొన్నేకల్‌ గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్‌ మల్లన్న, నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ మువ్వ విజయబాబు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశానికి పట్టభద్రులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

ఖమ్మం రైతుబజార్‌, సమీకృత మార్కెట్‌

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	34	బచ్చలికూర	4
వంకాయ	30		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	74		20
కాకర	56	చుక్కకూర	3
బీర	66		20
దొండ	30	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	110	గోంగూర	4
గోరుచిక్కుడు	48		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్‌	20		20
ఆలుగడ్డ	36	కొత్తిమీర	1
దొసకాయ	50		30
క్యారెట్‌	48	పుదీన	1
క్యాప్సికం	66		20

-ఖమ్మం వ్యవసాయం

కాదేదీ చోరీకి అనర్హం..!

నిర్మాణ దశలో ఉన్న ఇళ్లలో వైరింగ్‌ మాయం

- నల్లాలు కూడా వదలని వైనం
- కావలాలేకుండా తెల్లారేసరికి ఖతమే..
- వరుస దొంగతనాలతో భయపడుతున్న యజమానులు





బల్లేపల్లిలో చోరీకి గురైన నిర్మాణ దశలో ఉన్న ఇళ్లు

ఖమ్మంఅర్బన్‌: కొత్త ఇళ్లు నిర్మాణం చేసుకొని వాటికి విద్యుత్‌ సరఫరా కోసం వైరింగ్‌ లాగిన వైరును తెల్లవారేసరికి చోరీకి పాల్పడుతున్న ఘటనలు ఇటీవల కాలంలో ఖమ్మంఅర్బన్‌ పరిధిలో జోరుగా సాగుతున్నాయి. నగరంలోని గొల్లగూడెం, శ్రీనగర్‌కాలనీ, శ్రీశ్రీ సర్కిల్‌, గోపాలపురం, బాలపేట, బల్లేపల్లి, ఖానాపురం, యూపీహెచ్‌ కాలనీ, ఎస్‌ఎఫ్‌ఎస్‌ పాఠశాల తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలోనే నిర్మాణం చేస్తున్నారు. బిల్డర్లు, సొంతంగా ఇంటిని నిర్మాణం చేసుకునే వారి సంఖ్య గణనీయంగానే ఉంది. నిర్మాణ సమయంలో కొత్త ఇళ్లను కొంతమంది దొంగలు టార్గెట్‌ చేసుకుని వైరింగ్‌లాగిన ఇళ్లలో ఎవరూ లేకపోతే తెల్లవారేసరికి లాగిన వైరింగ్‌ మొత్తం ఎక్కడిక్కడే కట్టిరించుకునిపోతున్నారు. దీంతో కాల్చికుల ఖర్చుతో వైరింగ్‌ ఖరీదు ఒక్కో ఇంటికి లక్షల్లో నష్టం జరుగుతుందని బాధితులు వాపోతున్నారు. ఇలా చోరీ చేసిన వైరును కరగబెట్టి పాత ఇనుము వ్యాపారులకు అమ్ముతూ సొమ్ము చేస్తున్నట్లు తెలిసింది. కొంతమంది చోరీ జరిగాక పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మరికొంతమంది మాత్రం వైరు కొనుగోలు చేసి రీవైరింగ్‌ లాగించుకుంటూ కావలా ఉంటున్నారు.

నల్లాలను సైతం..

నిర్మాణ దశలో ఇళ్లల్లో నీటి నల్లాలను సైతం విరగగొట్టి తీసుకెళ్తున్నారు. నెల క్రితం నగరంలోని మధురానగర్‌లో పట్టపగలు ఇద్దరు వ్యక్తులు ఇంటిలోకి చొరబడి నల్లాలన్నీ ఎక్కడిక్కడే విరగగొట్టి తీసుకెళ్లారు. ఇదంతా సీసీ పుటేజీలో రికార్డు కావడంతో ఆ రికార్డులను స్థానిక డివిజన్‌లో పెట్టారు. మరుసటి రోజు సమీపంలోని గొల్లగూడెంలో అమ్మకట్టు కనపడటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. నాలుగు రోజులు క్రితం మధురానగర్‌లోని 12వ లైన్‌లో మరో ఇంట్లో సైతం ట్యాప్‌లను చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై గతంలో పోలీసులు కొంత మందిని అదుపులోకి తీసుకొని వదిలిపెట్టడంతో చోరీల పరంపర కొనసాగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.

పెద్దమొత్తంలో చోరీలు

ఇటీవల ఎస్‌ఎఫ్‌ఎస్‌ పాఠశాల సమీపంలో వెలిసిన ఓ ఇంటి నిర్మాణం దారుడి ఇంట్లో పెద్ద మొత్తంలోనే వైరును చోరీ చేశారు. ఇళ్ల నిర్మాణం చేసి వాటికి వైరింగ్‌ చేస్తే రాత్రికిరాత్రే సుమారు రూ.1 లక్షకు పైగా విలువైన వైరు చోరీ అయింది. అదే ప్రాంతంలో ఒక పోలీసు అధికారి ఇంటి నిర్మాణం చేసి వైరింగ్‌లాగితే తెల్లవారేసరికి రూ.1 లక్ష విలువైన వైరు చేసినట్లు తెలిసింది. ఎస్‌ఎఫ్‌ఎస్‌ పాఠశాల పక్కనే నిర్మాణంలో ఉన్న ఒక ఇంటి సామాన్లు, మోటారు చోరీ చేసినట్లు తెలిపారు. ఇలా ప్రతీ రోజు నగర శివారు పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను టార్గెట్‌ చేసి చోరీలపర్వం కొనసాగుతుంది. ఇప్పటికైనా పోలీసులు అధికారి వారిపై దృష్టి సారించి కొత్త ఇంటి నిర్మాణదారుల్లో భయపెడుతున్న వైర్ల చోరీలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



చోరీకి గురైన వైరింగ్‌

రూ. లక్ష విలువైన వైరింగ్‌ చోరీ..



నా ఇంటి నిర్మాణం చేసి సీలింగ్‌ చేసి వైరింగ్‌ చేశాం. రాత్రికి రాత్రే రెండు ఇళ్ల వైరింగ్‌ మొత్తం ఎక్కడిక్కడే కట్‌ చేసి లాగేశారు. దీంతో అదనంగా వైరు ఖర్చుతో పాటు, లాగినందుకు కూలీలకు ఖర్చు కూడా భారంగా మారింది. మా ఇళ్ల పక్కన నిర్మాణాల్లో సైతం చోరీలు జరుగుతున్నాయి.

– సీహెచ్‌ వెంకన్న, బల్లేపల్లి, ఇంటినిర్మాణదారుడు

ఇంటి సామాన్లు, రాడ్లు చోరీ..



నిర్మాణంలో ఉన్న నా సామాన్లు చోరీ చేశారు. ఇనుప రాడ్లు, గడ్డపారలు, ఇతరత్రా సామగ్రి చోరీ చేశారు. రాత్రయితే సామాన్లు దొంగిలిపోకుండా ఉండటానికి కాపలాకాయాల్సి వస్తుంది. ఇంటినిర్మాణమే భారం అయితే.. అదనంగా దొంగల చోరీలతో మరింత భారంగా మారుతుంది.

– వాంకుడోత్‌ మంగ్యా, బల్లేపల్లి

చోరీలపై ఎలాంటి ఫిర్యాదు అందలేదు..

గతంలో మధురానగర్‌లో ట్యాప్‌లో చోరీ చేసిన వారిని పట్టుకున్నాం. నూతన ఇండ్లకు సంబంధించిన కొత్త వైరింగ్‌ వైర్‌ చోరీ అయినట్లు మా దృష్టికి రాలేదు. అయినా గస్తీ పెంచుతాం. దొరికిన వారిని వదిలిపెట్టేదిలేదు. దొంగతనాలు అదుపుకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

– భానుప్రకాష్‌, ఖమ్మంఅర్బన్‌ సీఐ

పోరాటమే సుందరయ్యకు నివాళి



ఖమ్మంమయూరిసెంటర్‌: సుందరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



ఖమ్మంరూరల్‌: నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్‌: దేశంలో నెలకొన్న విద్వేష రాజకీయాలను తిప్పికొడుతూ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయడమే పుచ్చలపల్లి సుందరయ్యకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ... కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తూ, దళితులపైన, మైనార్టీలపైన దాడులు చేస్తున్నదన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, నాయకులు యం.సుబ్బారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్‌, మెరుగు సత్యనారాయణ, ఆర్‌.ప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్‌: మండలంలోని ఏదులాపురం, తెల్దారుపల్లి, తల్లంపాడు, ఎం.వెంకటాయపాలెం, పొన్నేకల్‌, కాచిరాజుగూడెంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు ఆధ్వర్యంలో తిరుమలరావు, ప్రసాద్‌రావు, పెండ్యాల సుమతి, వెంకటరమణ,విజయ్‌రెడ్డి, నాగయ్య, వినోద్‌, వెంకటేష్‌ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ సాయుధ పోరా అమరవీరుల స్థూపం వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు దొండేటి ఆనందరావు గ్రామ శాఖ కార్యదర్శి బొడ్డ లింగస్వామి, పప్పుల ప్రసాద్‌, ఉపేందర్‌ మాజీ సర్పంచ్‌ అంగడి వీరస్వామి, రామన బోయిన రవి, వెంకటేశ్వర్లు, దొండేటి నిర్మలాలా, దొండేటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోటాపురంలో సీపీఎం మండల కార్యదర్శి కె.వి.రెడ్డి, బంటారి శేఖర్‌, పగిడికత్తుల నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి, మందుల లక్ష్మయ్య, శ్రీనివాసరావు, గువ్వలగూడెంలో నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మారుతి కొండలు, అప్పారావు, ఆరెగూడెంలో జోన్‌ కన్వీనర్‌ పగిడికత్తుల నాగేశ్వరరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం: పిండిప్రోలులో..



నేలకొండపల్లిలో..

ఏబీవీపీ కమిటీ ఎన్నిక



ఏబీవీపీ కమిటీ రాష్ట్ర జాతీయ బాధ్యులు

ఖమ్మం అర్బన్‌: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌ (ఏబీవీపీ) కమిటీని ఆదివారం నగరంలోని గోపాలపురంలోని సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధికారిగా పాండవన వెంకటేషన్‌ తమీనాడు రాష్ట్ర కోశాధికారి, అబ్జర్వర్‌ బండికట్ల శ్రీనివాసచారిలు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా కాటేపల్లి రజనీకాంత్‌, కార్యదర్శిగా చిర్రా రవి, కోశాధికారిగా చెరుకూరి కోటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం జాతీయ సీఈసీ, గొరిజల్లె రాజు, రాష్ట్ర కార్యదర్శి టీవీ పుల్లంరాజు, జోనల్‌ సెక్రటరీ ఇన్చార్జ్‌ నగేష్‌ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కామేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాల పదో తరగతి 2002–03 బ్యాచ్‌ పూర్వ విద్యార్థులు ఆదివారం మండలంలోని కొత్తలింగాల గ్రామంలోని ధనలక్ష్మి ఫంక్షన్‌ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరేసుకుని ఆత్మీయంగా పలకరించుకుని ఆటపాటలతో సందడిగా గడిపారు.

వర్షానికి తడవకుండా పార్శిళ్లు భద్రం..

ఖమ్మంమయూరిసెంటర్‌: ఖమ్మం నూతన బస్టాండ్‌లోని కార్గో సర్వీస్‌ పాయింట్‌లో వినియోగదారుల పార్శిల్స్‌ను సిబ్బంది వర్షానికి తడవకుండా భద్రపరిచారు. ఆదివారం 'కార్గో సిబ్బంది నిర్లక్ష్యం' అను శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు చర్యలు చేపట్టారు. కార్గో పాయింట్‌లో పార్శిల్స్‌ను బయట పెట్టకుండా, లోపల పెట్టేలా చర్యలు చేపట్టారు. ఇక కార్గో పాయింట్‌ వద్ద వర్షం కురవకుండా, జల్లు పడకుండా రేకులు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిబ్బందిని అధికారులు ఆదేశించినట్లు తెలిసింది.

సాక్షి ఎఫెక్ట్‌..



బస్టాండ్‌ లోపల పెట్టిన పార్శిళ్లు

ఉపాధ్యాయుడి పాత్ర కీలకం



ఖమ్మం సహకారనగర్‌: నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్‌: ప్రస్తుత సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమని పలువురు వక్తలు అన్నారు. ఇటీవల మరణించిన ఉపాధ్యాయుడు, టీపీటీఎఫ్‌ నాయకులు కూరాకుల శేషగిరి సంతాప సభను ఆదివారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంతట రామాచారి, టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.వి.నాగేశ్వరరావు, ఎస్‌.విజయ్‌లు మాట్లాడుతూ... సమాజం అభివృద్ధి చెందాలంటే పాఠశాలలో సరైన బోధన ద్వారానే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు రాయల వెంకటేశ్వరరావు, రవికుమార్‌, వై.వెంకటేశ్వరరావు, పద్మ,సుందరాజి, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గానమాధురి

ఖమ్మంగాంధీచౌక్‌: నగరంలోని త్రీటౌన్‌ గాంధీచౌక్‌ వర్తక సంఘం భవనంలో ఆదివారం రాత్రి ఎస్‌కే.అంజాద్‌ పాషా కల్చరల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన గానమాధురి కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్‌ చంద్రమౌళి దివంగత గాయని, గాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాయనీ, గాయకులు ఏస్కే రఫీ, కె.జనార్దనరావు, ఎస్‌.ప్రకాష్‌, ఎండీ.జాఫర్‌, నాగసన్యద్ద, పావని, కృష్ణ, శబరి, రూపస్యి, ఆకుల గణపతిరాజు, మోహన కృష్ణలు మధుర గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు.



పాటలు పాడుతున్న గాయని, గాయకులు

కేటీఆర్‌ పర్యటనను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆర్‌జేసీ కృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్‌: బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కల్వకుంట్ల తారక రామారావు సోమవారం ఖమ్మంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్సీ ఎన్నికల ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ ఆర్‌జేసీ కృష్ణ, బీఆర్‌ఎస్‌ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజులు తెలిపారు. ఆదివారం ఎస్‌బీఐటీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఖమ్మం-వరంగల్‌-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల ప్రచారం కోసం కేటీఆర్‌ ఖమ్మం వస్తున్నారన్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నుడా మాజీ చైర్మన్‌ బచ్చు విజయకుమార్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నృత్యహేళలో ఖమ్మం కళాకారుల ప్రదర్శన

ఖమ్మంగాంధీచౌక్‌: అన్నమయ్య జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం భరత్‌ ఆర్ట్స్‌ అకాడమీ నిర్వహించిన నృత్య హేళ కార్యక్రమంలో ఖమ్మం నగరానికి చెందిన కళ్యాణం భరత నాట్యాన్ని ప్రదర్శించింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న అభినయ గురు కళాకారులు హంశిక, జశ్విత, కృతిక, మాన్విత, శాన్వి తదితరులతో పాటు శిక్షకుల పణిలేయ నిర్వాహకులు పురస్కారాలను అందించారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

నేలకొండపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ శాకమూరి రమేష్‌ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు మంత్రి చేపట్టిన 'ప్రజల వద్దకు పాలన' అనే కార్యక్రమం సోమవారం మండలంలోని గువ్వలగూడెంలో ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. మంత్రి పర్యటనలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు.

పట్టభద్రుల ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు..!

- ఇంటింటికీ పోల్‌స్లిప్పుల పంపిణీ



పోల్‌స్లిప్పులు పంపిణీ చేస్తున్న బీఎల్‌వోలు



నేలకొండపల్లిలో పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్‌ గాజీశంకర్‌

నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు

మండలం	ఓటర్లు	పోలింగ్‌ కేంద్రాలు
ఖమ్మం రూరల్‌	6,446	6
నేలకొండపల్లి	3,081	4
కూసుమంచి	3,036	3
తిరుమలాయపాలెం	2,468	2

నేలకొండపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక దగ్గర పడటంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ నెల 27న ఖమ్మం-వరంగల్‌- నల్లగొండ శాసనమండలి ఉపఎన్నికను నిర్వహించేందుకు అధికారులు కార్యచరణ రూపొందిస్తున్నారు. పాలేరు నియోజకవర్గం పాలేరు నియోజకవర్గంలో మొత్తం 15,031 ఓట్లుకు, 15 పోలింగ్‌ కేంద్రాల్లో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

పోల్‌స్లిప్పులు పంపిణీ..

పాలేరు నియోజకవర్గంలో శాసనమండలి ఓట్లకు గాను ఆయా పంచాయతీల పరిధిలో బూత్‌లెవల్‌ అధికారులు ఓటర్లకు పోల్‌ స్లిప్పులను పంపిణీ చేశారు. డివిజన్‌లో ఎక్కువగా ఖమ్మం రూరల్‌ మండలంలోనే ఎక్కువగా ఉండటంతో మండల కేంద్రంలో ఆరు పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. డివిజన్‌లో అన్ని పోలింగ్‌ కేంద్రాలకు అవసరమైన సిబ్బందిని ఎంపిక చేశారు. తహసీల్దార్లు, ఎన్నికను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి ఓటరుకు ఇంటికెళ్లి పోల్‌స్లిప్పులు పంపిణీ చేయాలని ఆయా ప్రాంతాలకు చెందిన తో బీఎల్‌వోలు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాం. మండల కేంద్రంలో నాలుగు పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశాం. పట్టభద్రులు స్వచ్ఛందంగా వచ్చి ఓట్లు హక్కును వినియోగించుకోవాలి. వంద శాతం పోలింగ్‌ జరిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– గౌరీశంకర్‌, తహసీల్దార్‌, నేలకొండపల్లి

ప్రతీ ఒక్కరు ఓటు వేయాలి



శాసనమండలిలో నిరుద్యోగుల గురించి ప్రస్తావించే వారికే ఓటు వేసేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారు. కొత్తగా ఎన్నికకావాల్సిన ఎమ్మెల్సీ నిరుద్యోగుల గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ విధంగా వంద శాతం ఓటింగ్‌ చేసేలా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– జెర్రిపోతుల మురళీకృష్ణ, నేలకొండపల్లి

సరైన నిర్ణయం తీసుకోవాలి..



యువత, విద్యార్థి ఎమ్మెల్సీ ఎన్నికలలో సరైన నిర్ణయం తీసుకోవాలి. విద్యారంగం, నిరుద్యోగ సమస్య పై శాసన మండలిలో సమస్యలపై ప్రశ్నించాలి. ఓటు వేసే ముందు యువత, విద్యార్థి ఆలోచించి ఓటేయాల్సిన అవసరం ఉంది. యువత భవిష్యత్‌ కోసం పోరాడే వారిని గుర్తించి ఓటు వేయాలి.

– మనుమర్తి శ్రీనివాస్‌, సామాజిక ప్రతినిధి